# కంతి తలగడ కాదు, కల నిజం కాదు!

"అయ్యగారూ! నన్ను క్షమించాలి. మీతో కబుర్లాడుతూ కూచుంటే నాకు గడవదు. అంతగా మాట్లాడాలనుకుంటే, బెల్ కొట్టిన తర్వాత రండి. అప్పటికి పిల్లలంతా వెళ్ళిపోతారు." అన్నాడు మునికన్నయ్య - అంత కోపమూ, మరీ అంత విసుగూ కాకుండా.

అప్పటికే వో డజనుమంది పిల్లలు అతనిచుట్టూ గుమిగూడి ఉన్నారు. వాళ్ళందరూ మునికన్నయ్యను పీక్కుతింటున్నారు. వాళ్ళను కసురుకోలేడు. వాళ్ళతొందరకు తట్టుకోలేడు. బేరాన్ని పోగొట్టుకోనూ లేడు. ఆ పదినిమిషాలసేపూ, అతని చేతులు, యంత్రాల్లా పనిచేస్తాయి. మళ్ళీ గంటదాకా తీరుబడి.

సరిగ్గా- ఆ తీరుబడి సమయంలోనే ముని కన్నయ్య తన్ను గురించి చెప్పుకొన్నాడు, "మాది బుక్కపట్నం" అన్నాడు మునికన్నయ్య. అంతలోనే బొంబాయ్ మిఠాయిమీద వాలిన ఈగల్ని తోలడంలో మునిగిపోయాడు. కాస్సేపయ్యాక-

"ఏదో పొలం ఉండేది. ఇప్పుడదీ లేదులెండి. మీ పొలాలకు మల్లే మావి బాగా పండవు అయ్యగారూ! మీవి నల్ల భూములు. మీకు వానలు పడతాయ్. పైగా కాలవలు, మీ వూళ్ళ మధ్యగా, మీ ఇళ్ళముందు నుంచి పోతాయ్. మాకు నీళ్ళకు మాలావు కరువు అయ్యగారూ! ఎండా కాలం వస్తేనే మీకు నీళ్ళకు కటకట. మాకు అన్ని కాలాలూ ఎండాకాలాలే! ఎప్పుడూ నీళ్ళకు కరువే. ఏ రెండేళ్ళకో, మూడేళ్ళకోగానీ బాగా వాన పడదు. ఆవురావురుమంటున్న పొలాలూ- ఎంత నీరన్నా అయిపూ ఆనవాలూ లేకుండా తాగుతాయి. మీరీ ప్రాంతం ఎప్పుడూ రాలేదనుకుంటా. తిరుపతి సరేలెండి- రాయలసీమ అంటే ఒక్క తిరుపతే కాదు గదా. తాగడానికే మాకు నీళ్ళుండవు. ఇక గొడ్డూ గోదా- పొలమూ పుట్రా ఉండి మాత్రం ఏం లాభం అయ్యగారూ!" అన్నాడు మునికన్నయ్య.

వందెకరాలున్న రైతుకూడా, వరసాగ్గా రెండేళ్ళు బెట్టతీస్తే, కూలి చేయడం ఆ ప్రాంతంలో సర్వసాధారణమన్నాడు మునికన్నయ్య.

"అదెందుకో నాకు తెలియదండీ. భగవంతుడు ఈ ప్రాంతమీద పగపట్టినట్లున్నాడు. ఏవో కాలువలనీ, చెరువులనీ, లోతు చేయడమనీ, నా బొందనీ, బొక్కసాయనీ అంటుంటారు. నాకు ఊహ తెలిసినప్పణ్ణించీ వింటున్నా ఒకటీ జరగలా." అన్నాడు మునికన్నయ్య కోపాన్ని లోలోపలే దిగమింగుతూ.

వానలు బాగా కురిస్తే, అతనికున్న నాలుగెకరాల పొలంలోనూ, వేరుశనగ విరగపండుతుంది. కనీసం నాలుగు తడులు నీరు పెట్టుకునే అవకాశం ఉన్నా , తనిలా బండితోసుకు బతకవలసిన అవసరం వుండేది కాదు. కాలవలా లేవు. వానలా కురవవు. విత్తన ఖర్చు కూడా గిట్టని వ్యవసాయం, ఎంత కాలం చేయగలడు గనక?

పొలం అమ్మేశాడు, ఉన్న బాకీలు తీర్చేశాడు. చెల్లెలి పెళ్ళి చేశాడు. ఉన్న నాలుగు రూపాయలూ జేబులో వేసుకొని పదిహేనేళ్ల కిందట తిరుపతి వచ్చాడు.

"అది రెండోసారి రావటమండీ, మొట్టమొదటిసారి, అంతకు మూడు నాలుగేళ్ళ కిందట

వచ్చాను. అప్పుడు మా కిష్టప్ప మరీ చిన్నవాడు. వాడికేదో జబ్బు చేసింది. మా అమ్మ వెంకన్నకు మొక్కుకొంది. జబ్బునయమయింది. మొక్కు చెల్లించడానికొచ్చాం. అప్పటికే మా నాన్న భుజం మీద కూచున్నాడు. మా అమ్మ ఆపసోపాలు పడుతోంది. నా నెత్తిన 'ఇంత' మూట పెట్టారు... లేకేం అయ్యగారూ మా కిష్టప్ప ఇప్పుడు అదేదో, అచ్చాఫీసులో పనిచేస్తున్నాడు. అరవయ్యో, డెబ్బయ్యో ఇస్తారనుకొంటా'' అన్నాడు మునికన్నయ్య. మునికన్నయ్య చిన్నతనమంతా కలలు కనడంతోనే సరిపోయింది. అతనికి సిల్కు చొక్కా తొడుక్కుందామనీ, జులపాలు పెంచుకుందామనీ, మెళ్ళో సన్నని బంగారు గొలుసు వేసుకొందామనీ, మల్లెపూవులాంటి తెల్లని లాగు వేసుకొందామనీ - సరదా ఉండేది.

“మాకు రెండు బజార్ల అవతల సుబ్బరామిరెడ్డి గారుండేవారు అయ్యగారూ! చాలా పెద్దదొర. బోలెడన్ని పొలాలు నిమ్మతోటలు జామతోటలూ వారికుండేవి. వారబ్బాయి రామచంద్రారెడ్డిది- నా ఈడే. నాలుగు రోజుల తేడాతో మేం పుట్టామట. రామచంద్రారెడ్డి చిన్నప్పణ్నుంచీ సిల్కు చొక్కాలే వేసుకునేవాడు. భుజాల మీద పడుతుండే జులపాలు పెంచుకునేవాడు. మెళ్లో సన్నని గొలుసు, ఆ గొలుసు మధ్యలో ఆంజనేయుల బిళ్ళా- అదీ బంగారందేననుకోండి - వేసుకునేవాడు. పాలరంగులో వుండే వొదులు వొదులు లాగులు వేసుకునేవాడు. చెవులకు కమ్మలుండేవి నాకు కమ్మలమీద బుద్ధి పోలేదు గానండీ, మిగిలనవన్నీ కావాలనిపించేది. చెబితే మీరు విడ్డూరమనుకొంటారేమో అయ్యగారూ, ఆ సరదాలు నాకిప్పటికీ తీరలేదండి'' అన్నాడు మునికన్నయ్య బాధగా.

ఆ బాధ అతని గొంతులోకన్నా, కనుల్లో మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

మరింక చదువుగురించి అడగవద్దన్నాడు. కలిగిన వాళ్ళను తప్ప, లేని వాళ్ళకు ఈ దేశంలో చదువు కూడా దొరకదన్నాడు. వానాకాలం చదువేదో చదివినా అది ఎందుకూ పనికిరానిదేనన్నాడు.

“కొంత కాలం వో మోటారు వర్కుషాపులో పనిచేశా. ఇంకొంత కాలం రైళ్ళ దగ్గర మూటలు మోశా... ఏం పాడు బతుకులో అయ్యగారూ చచ్చేంత బరువు నెత్తికెత్తి, పావలా దగ్గర్నించీ బేరమాడుతారు. బోలెడన్నీ ఖర్చులు చేస్తారాండీ. మా దగ్గర కొచ్చేసరికి లబ్బున ఏడుస్తారు... ఒకసారి హడావిడిగా బరువెత్తుకొన్నా అయ్యగారూ- బొంబాయి సేట్ బండిలోకెక్కాడు. బండి కదిలింది. సామాను లోపలికి విసిరేశా. సేటు నాకు డబ్బులివ్వలా? కూలికోసం, బండితోపాటే పరిగెత్తుతున్నా. అయినా వాడు డబ్బులిచ్చే ధోరణిలో లేడు. బండి వేగం పుంజుకొంటున్నది అయ్యగారూ! ఆ పూటకదే ఆఖరు బండి ఈ డబ్బులు తీసికెళితే తప్ప, ఇంటి దగ్గర పొయ్యి వెలగదు. నేను అరిచా. చువ్వ పట్టుకొని బండిలోకి దూకుదామనుకొని చువ్వను వొడిసి పట్టుకొన్నా స్పీడు పెరిగింది. కాలు మెట్టుమీద పడడానికి బదులు జారింది. చేతిపట్టు విడిపోయింది...'' అని కన్నయ్య ముగించాడు.

అలా విడిపోయిన దాని ఫలితంగా, అతని కాలు తొడదాకా నరుక్కుపోయింది. ఆ తరువాత బండి ఆగిందనుకోండి. వాడిచ్చింది ఎంతయినా, ముని కన్నయ్య కాలు మాత్రం మళ్ళా రాదుగదా. పూర్తిగా నయమయి, ఆసుపత్రినుండి బయటపడేలోగా, ఆ కుటుంబం నరకయాతనలూ అనుభవించింది.

“మా అమ్మ ఇళ్ళలో పనిచేసింది. కొండమీదికి మూటలు మోసింది. తను పస్తులుండి నాకు

పెట్టింది. నాలుగు డబ్బులు పోగయ్యాక ఇంకాస్త అప్పుచేసి ఈ బండిని కొన్నది... అది! చాలా గమ్మత్తుగా జరిగింది అయ్యగారూ, నేను ఆసుపత్రిలో వుండగా 'సుందర్‌సింగ్' అని, వో బొందిలీ తాత - రోజూ ఈ మిఠాయి అమ్మడానికొచ్చేవాడు. ఉన్నప్పుడు కొనుక్కొనే వాణ్ని. లేనప్పుడు... అతను చాలా మంచివాడు. నేనంటే పిచ్చిఅభిమానం అయ్యగారూ. నేను ఆసుపత్రిలో ఉన్నంత కాలమూ ఫ్రీగా యిచ్చాడు మిఠాయి. ఆ తరువాత చేయడమూ నేర్పాడు. అదే నాకిప్పుడు బతుకుతెరువయింది. ఆ... నా పాడె లాభాలు, నా పిచ్చి బద్ద లాభాలు... ఐదు పైసల దగ్గర్నుంచి అర్ధరూపాయి దాకా మిఠాయి కొంటారు. పెట్టుబడి కూడా పెద్దగా అక్కరలేదు. రెండు కిలోల పంచదార, ఓ డబ్బుడు రంగు, వెదురు పూచలు, ఇదిగో ఈ డబ్బా అడుగున ఈ 'స్టవ్' బస్ అంతే!''

మునికన్నయ్య అటూ ఇటూ కదల్లేడు. బండిమీద కూచోబట్టుకొని, ఈ స్కూల్ దాకా తోసుకొచ్చి తల్లి వెళ్ళిపోతుంది. మునికన్నయ్య సాయంత్రం దాకా అక్కడే ఉండి బేరం చూసుకొంటాడు. వస్తే తల్లి వస్తుంది, లేదా - ఎవరికన్నా వో పావలా డబ్బులిచ్చి, బండిని ఇంటి దాకా తోయించుకెడతాడు.

''ఊళ్ళో తిరిగినా బేరం వుండదు అయ్యగారూ! ఇది చిన్న పిల్లలు తినే మిఠాయిగాని, పెద్దవాళ్ళు తినేది కాదు. అంటే పనికిరాదని కాదండీ- అందరూ చూస్తుండగా పెద్దవాళ్లు తినరు... అందుకే ఈ స్కూల్ను నమ్ముకున్నా. ఈ పిల్లలు కూడా నా దగ్గిరే కొంటారు. పావలా, అర్ధా, అప్పు కూడా పెడుతుంటా. చాలా మంది ఇస్తారు. పారుబోయే ఖాతాలు కూడా ఉంటాయండీ!'' అన్నాడు మునికన్నయ్య.

''ఏం బతుకులే అయ్యగారూ! ఈ మిఠాయిలాగానే ఉంటుందండీ! చూస్తే ఇంత లావుగా బుజబుజలాడుతూ ఉంటుందా- నొక్కితే చింతగింజంత కూడా 'సరుకు' ఉండదు''

ఈ వ్యాఖ్య మొత్తం మన సమాజానికే వర్తిస్తుందేమో!